



అడయార్ జంక్షన్ మెట్రోరైల్వేస్టేషన్ సమీపంలో సొరంగమార్గం తవ్వుతూ వస్తున్న 'కావేరి' యంత్రాన్ని పరిశీలిస్తున్న సీఎం స్టాలిన్

త్వరిత గతిన మెట్రో పనులు

పూర్తి చేయాలి

- సొరంగమార్గం పరిశీలించి పనుల పురోగతి తెలుసుకున్న సీఎం

చెన్నై, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టు పనుల్లో భాగంగా కెల్లీస్ నుంచి తరమణి వరకు జరుగుతున్న సొరంగ మార్గ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గురువారం పరిశీలించారు. గ్రీన్‌వేస్ మెట్రో రైల్వే స్టేషన్ నుంచి అడయార్ జంక్షన్ మెట్రోరైల్వే స్టేషన్ మధ్య 300 మీటర్ల పొడవున అడయార్ వాగు దిగువన సొరంగ మార్గం తవ్వకాలను ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. అడయార్ వాగు దిగువన సుమారు 40 నుండి 50 అడుగుల లోతులో ఈ సొరంగ రైలు మార్గం తవ్వేందుకు కావేరి అనే భారీ యంత్రపరికరాన్ని ఉపయోగిస్తున్నారు. ఆ యంత్రం గురువారం ఉదయం అడయార్ జంక్షన్ మెట్రోరైలు సమీపంలో సొరంగమార్గాన్ని తవ్వుకుంటూ బయటకు రావటాన్ని ముఖ్యమంత్రి మెట్రోరైలు ప్రాజెక్టు అధికారులతో కలిసి పరిశీలించారు. రెండో దశ మెట్రో రైలు ప్రాజెక్టు పనులను సకాలంలో పూర్తిచేయాలని ఆ సందర్భంగా అధికారులకు ఆయన ఆదేశాలిచ్చారు. స్టాలిన్ తోపాటు మంత్రులు కేఎన్ నెహ్రూ, పొన్ముడి, చెన్నై మెట్రోరైలు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎంఏ సిద్ధిక్ తదితరులు సొరంగ మార్గం తవ్వక పనులను పరిశీలించారు.

పేరాసియర్ అరంగం ప్రారంభం...

వలసరవాక్కంలో డాక్టర్ మనమల్లి అన్బళగన్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన 'పేరాసియర్ అరంగం (హాలు)ను ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు కేఎన్ నెహ్రూ, ఆర్ఎస్ రాజకన్నప్పన్, ఎం.సుబ్రమణ్యం, ఎమ్మెల్యేలు వెట్రి అళగన్, తాయగం కవి, డాక్టర్ ఎన్.ఎళిలన్, కారపాక్కం కె.గణపతి, ఎంకే మోహన్, ఏఎంవీ ప్రభాకర్ రాజా, మాజీ మంత్రి దివంగత అన్బళగన్ కుమారుడు ఎ.అన్బుసెల్వన్ తదితరులు పాల్గొన్నారు.



రెండాకుల గుర్తుకు

మళ్లీ ముప్పు?

- ఈసీ విచారణలో ఏం తేలుతుందో?
- అటు నుంచి తీర్పు ఏమొస్తుందో?
- అన్నాడీఎంకేవర్గాల్లో ఆందోళన

చెన్నై, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే అధికారిక చిహ్నం రెండాకులకు మళ్లీ ముప్పు పొంచివుందా?.. ఈసీ విచారణలో ఏదైనా తప్పు దొరికితే రెండాకుల స్తంభన తప్పదా?.. అధికార డీఎంకేపై సమరానికి సిద్ధమవుతున్న వేళ ఈ పరిణామం ఎటు నుంచి ఎటువైపు దారి తీయనుంది?.. ప్రస్తుతం అన్నాడీఎంకే వర్గాల్లో దీనిపై ఆందోళన నెలకొంది. అన్నాడీఎంకే అంతర్గత వ్యవహారాలపై కేంద్ర ఎన్నికల సంఘం విచారణ జరిపేందుకు ఎలాంటి అభ్యంతరాలు లేవంటూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులతో ఆ పార్టీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. అదే సమయంలో హైకోర్టు ఉత్తర్వులు తమకు సానుకూలమంటూ మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) వర్గీయులు మళ్లీ బయటకు వస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి జయలలిత మరణానంతరం పార్టీలో ప్రధాన కార్యదర్శి పదవిని పక్కనబెట్టి.. అప్పట్లో ముఖ్యమంత్రిగా వున్న ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఉప సమన్వయకర్తగా, ఓపీఎస్ సమన్వయకర్తగా వ్యవహరించారు. అదే సమయంలో పార్టీ ఆధిపత్యం కోసం ఇరువురి మధ్య పోటీ పెరగటంతో మెజారిటీ సభ్యులు ఈపీఎస్ అండగా నిలిచారు. ఆ తర్వాత ఈపీఎస్ సర్వసభ్యమండలి సమావేశాన్ని ఏర్పాటు చేసి, పార్టీ నియమావళిని మార్చి పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి చేపట్టారు. అయితే ఆ తరువాత ఈపీఎస్ నిర్వహించిన సర్వసభ్యమండలి సమావేశం చెల్లదని, పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఆయన ఎంపిక చట్ట వ్యతిరేకమంటూ దాఖలైన పలు కేసులు హైకోర్టులో, సుప్రీంకోర్టులో తిరస్కరణకు గురయ్యాయి. ఈ వివాదాలపై సివిల్ కోర్టుల్లో మాత్రమే విచారణ పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో సివిల్ కోర్టులో దాఖలైన పిటిషన్‌లపై విచారణ ముగిసి తీర్పు వచ్చేంత వరకు ఈపీఎస్ ఆయన వర్గీయులు పార్టీ చిహ్నం రెండాకులను ఉపయోగించకుండా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన కేసులో వెలువడిన ఉత్తర్వుల ప్రకారం ఎన్నికల సంఘం విచారణ ప్రారంభించింది. ఆ విచారణపై హైకోర్టు స్టే విధించింది. ఆ స్టేను తొలగించాలని కోరుతూ ఓపీఎస్ కుమారుడు రవీంద్రనాథ్ తదితరులు వేసిన పిటిషన్లపై విచారణను పూర్తి చేసిన హైకోర్టు అన్నాడీఎంకే అంతర్గత రాజకీయ అంశాలపై కేంద్ర ఎన్నికల సంఘం విచారణ జరుపవచ్చంటూ తేల్చి చెప్పింది. ఎన్నికల సంఘం విచారణ జరుపకుండా ఉత్తర్వులివ్వాలని కోరుతూ ఈపీఎస్ తరఫు దాఖలు చేసిన పిటిషన్ తోసివేతకు గురైంది. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం అన్నాడీఎంకే అంతర్గత వ్యవహారాలపై విచారణ జరిపేందుకు సిద్ధమైంది. ఈపీఎస్ వర్గీయులకు, ఓపీఎస్ వర్గీయులకు నోటీసులు పంపి వేర్వేరుగా విచారణ జరపాలని భావిస్తోంది. హైకోర్టు ఉత్తర్వులతో పార్టీలో 2017 నాటి పరిస్థితులు పునరావృతమవుతాయని ఈపీఎస్ వర్గీయులు ఆందోళన చెందుతున్నారు. 2017లో ఆర్కేనగర్ ఉప ఎన్నిక సమయంలో రెండాకుల గుర్తు స్తంభింపజేశారు. ఆ తరువాత ఈపీఎస్ నాయకత్వంలోని పార్టీని అంగీకరిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఆ గుర్తు కేటాయించింది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై ఓపీఎస్ తరఫు న్యాయవాదులు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం జరుపున్న విచారణలో తమ వర్గానికి న్యాయం జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ కేసీ పళనిసామి మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం సమగ్రంగా విచారణ జరిపితే ఓపీఎస్ వర్గానికి సానుకూలంగానే తీర్పు వస్తుందన్నారు. ఎంజీఆర్, జయలలిత హయాంలో ఏర్పాటు చేసిన పార్టీ నిబంధనలను మార్చే అధికారం ఈపీఎస్ వర్గీయులకు ఎక్కడిదని ప్రశ్నించారు. సమైక్య అన్నాడీఎంకేని మాత్రమే పార్టీ శ్రేణులంతా కోరుకుంటున్నారని, ఎన్నికల సంఘం విచారణ తర్వాత పార్టీ ఏకమవుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈపీఎస్ వర్గీయులు మాత్రం ఎన్నికల సంఘం విచారణ కాలయాపనే అవుతుందన్నారు. పార్టీలో రెండు బలమైన వర్గాలు ఉన్నప్పుడే కేంద్ర ఎన్నికల సంఘం విచారణ జరిపి ఉత్తర్వులు జారీ చేస్తుందని, అయితే ప్రస్తుతం పార్టీలో రెండు వర్గాలేలేవని, అలాంటప్పుడు తమకు సానుకూలంగానే ఎన్నికల సంఘం తీరవిస్తుందని తెలిపారు. ప్రస్తుతం పార్టీకి ఏ మాత్రం సంబంధంలేనివారంతా ఎన్నికుట్రలు చేసినా రెండాకుల చిహ్నం మళ్లీ స్తంభింపజేసే అవకాశం లేదని తెలిపారు.

కమల్‌తో ఉదయనిధి భేటీ



ప్యారీస్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మక్కల్ నీది మయ్యం (ఎంఎన్‌ఎం) అధ్యక్షుడు కమల్ హాసన్‌తో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి గురువారం భేటీ అయ్యారు. డీఎంకే కూటమిలో భాగస్వామ్యం వహిస్తున్న ఎంఎన్‌ఎంకు ఒక రాజ్యసభ స్థానం ఇవ్వాలని డీఎంకే నిర్ణయించిన విషయం తెలిసిందే. దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్‌బాబు మంగళవారం రాత్రి ఆళ్వార్‌పేటలోని ఎంఎన్‌ఎం కార్యాలయానికి వెళ్లి కమల్‌తో సమావేశమైనట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కమల్‌తో సమావేశమైనట్లు డిప్యూటీ సీఎం ఉదయనిధి తన ఎక్స్‌పేజీలో పోస్ట్ చేశారు. తాను కమల్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నానని, ఆయన తనను సాదరంగా ఆహ్వానించారని, సినిమా, రాజకీయ రంగాలపై చర్చించుకున్నట్లు తెలిపారు. ఇదిలా వుండగా డీఎంకే కూటమి తరఫున కమల్‌హాసన్ రాజ్యసభకు వెళ్లడం ఖాయమైనట్లు స్పష్టమైంది. గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎంఎన్‌ఎం తరఫున కమల్ డీఎంకేకు మద్దతు ప్రకటించడంతో పాటు పలు నియోజకవర్గాల్లో ప్రచారం చేశారు. డీఎంకే కూటమికి మద్దతుగా నిలిచి విజయానికి కారణమైన కమల్‌ను పెద్దల సభకు పంపిస్తామని అప్పట్లో ముఖ్యమంత్రి స్టాలిన్ ఇచ్చిన హామీ త్వరలో నెరవేరనుంది.

నన్నే అనుమానిస్తారా?

- ఎంజీఆర్-జయలలిత హయాంలోనే గుర్తింపు
- అన్నాడీఎంకే నేత సెంగోట్టయ్యన్
- ద్రోహుల ఎత్తుగడలు పార్టీని నిర్వీర్యం చేయలేవు
- మాజీ మంత్రి ఉదయకుమార్ సెటైర్లు



కేఏ సెంగోట్టయ్యన్, ఉదయకుమార్

అడయార్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రులు ఎంజీఆర్-జయ లేకుంటే తాను లేనని, వారి హయాంలోనే ఎంతో గుర్తింపు పొందిన తననే పార్టీలోని కొంతమంది అనుమానించడం శోచనీయమని అన్నాడీఎంకే సీనియర్ నేత, కేఏ సెంగోట్టయ్యన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈరోడ్డు జిల్లా గోపిచెట్టి పాళయంలో గురువారం జరిగిన ఎంజీఆర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఈరోడ్డు తూర్పు నియోజకవర్గ ఉప ఎన్నిక ఉన్నందున ఈపీఎస్ అనుమతి మేరకే తాను ఈ వేడుకలను ఆలస్యంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తాను ఎంజీఆర్-జయ మార్గదర్శకంలో నడిచినవాడినని, రాష్ట్ర వ్యాప్తంగా అన్నాడీఎంకే కార్యకర్తల పేర్లు తెలిసిన వ్యక్తిగా పేరుందన్నారు. జయకు సారథిగా వ్యవహరించానని, తననెవ్వరూ నియంత్రించలేరన్నారు. ఎంజీఆర్ హయాంలోనే పార్టీకి సేవలందించి గుర్తింపు పొందానన్నారు. ఇటీవల సేలంలో జరిగిన కార్యక్రమంలో ఎంజీఆర్-జయలలిత ఫొటోలు లేకపోవడం వల్లనే తాను హాజరు కాలేదన్నారు. కానీ ఆ కార్యక్రమాన్ని తాను బహిష్కరించలేదన్నారు. అయితే దీనిపైనే అన్నాడీఎంకేలో ప్రధానంగా చర్చ జరుగుతోందన్నారు. దీనిపై తానేమీ బాధ పడడం లేదని, తాను చాలా స్పష్టంగా వున్నానన్నారు. 43 ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్న తాను ఎప్పుడూ ఎక్కడా తప్పు మాట్లాడలేదని వ్యాఖ్యానించారు.

ఇదిలా ఉండగా ద్రోహుల ఎత్తుగడలు, వ్యూహాలు అన్నాడీఎంకేను నిర్వీర్యం చేయలేవని ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రి ఆర్‌బీ.ఉదయకుమార్ పరోక్షంగా సెంగోట్టయ్యన్‌కు చురక అంటించారు. ఉదయకుమార్ గురువారం ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. దివంగత పురట్చితలైవి ఆశీస్సులతో అన్నాడీఎంకేకు ఎదురయ్యే కష్టాలు సులభంగా అధిగమిస్తామన్నారు. ఇపుడు కొత్తగా తెరపైకి తెస్తున్న వాదనలు, కొందరు చేస్తున్న ద్రోహాలు పార్టీని ఏమాత్రం నిర్వీర్యం చేయలేవన్నారు. ప్రజల కోసం పాటుపడే సంస్థ. జయలలిత చెప్పినట్టుగా ప్రజల వల్ల నేను.. ప్రజల కోసం నేను అనే నినాదం మేరకు పార్టీ నేతలంతా ఐకమత్యంతో పనిచేస్తారన్నారు.

అరివాలయాన్ని కూల్చేదాకా వుంటా

- బీజేపీ నేత అన్నామలై శపథం
- ఇలాంటివారు కాలగర్భంలో కలిసి పోయారు
- భగ్గుమన్న డీఎంకే నేతలు



ఆర్ఎస్‌భారతి, అన్నామలై, శేఖర్‌బాబు

చెన్నై, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పార్టీ అధ్యక్షుడిగా ఉన్నా లేకపోయినా డీఎంకే ప్రధాన కార్యాలయమైన అన్నా అరివాలయం కూల్చివేసేంత వరకు తాను రాష్ట్రంలోనే ఉంటానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై శపథం చేశారు. ఈ వ్యాఖ్యలపై డీఎంకే నేతలంతా మండిపడ్డారు. తిరువాన్మియూరులో కేంద్ర బడ్జెట్ అంశాలపై జరిగిన ప్రచార సభలో అన్నామలై మాట్లాడుతూ.. 2026 ఎన్నికల తర్వాత అవినీతికి పాల్పడిన డీఎంకే నేతలంతా జైలుకెళ్లటాన్ని కూడా తాను కళ్ళారా చూస్తానన్నారు. సీఎం స్టాలిన్ వెళ్లే ప్రతి చోటా కేంద్ర బడ్జెట్ గురించే మాట్లాడుతున్నారని, డీఎంకే ఎంపీలు పార్లమెంట్‌లో నిధుల కోసం మాట్లాడకుండా ఇతర రాష్ట్రాల గురించి మాట్లాడుతున్నారని, ఓ ఎంపీ పార్లమెంట్‌లో సంస్కృతంలో అనువాద పరికరాన్ని ఎందుకు ఏర్పాటు చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేయటం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర గవర్నర్, తాను పదవుల్లోనే కొనసాగాలని కోరుకుంటానని సీఎం స్టాలిన్ యెద్దేవా చేయడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు.

వారంతా మట్టికొట్టుకుపోయారు: ఆర్ఎస్ భారతి

బీజేపీ నేత అన్నామలై విమర్శలపై డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి తీవ్రంగా ఖండించారు. గతంలో అరివాలయాన్ని కూల్చివేస్తామంటూ శపథాలు చేసిన నేతలంతా మట్టికొట్టుకుపోయారని, ఆ కోవలోనే అన్నామలై డీఎంకే ప్రధాన కార్యాలయం గురించి అనవసరంగా ప్రస్తావించారన్నారు. అరివాలయం అవినీతి సొమ్ముతో నిర్మించినది కాదని, పార్టీ కార్యకర్తలు, నేతలు, సామాన్య ప్రజలు ఇచ్చిన విరాళాలు, వారి శారీరక శ్రమతో నిర్మించిన భవనం అనే విషయం అన్నామలైకి తెలిసే అవకాశం లేదన్నారు. 2026లోగా డీఎంకే మంత్రులంతా అవినీతి కేసుల్లో జైళ్లకు వెళతారంటూ జోస్యం చెబుతున్న అన్నామలై, 3026 వరకూ వేచి ఉన్నా ఆ జోస్యం ఫలించదన్నారు. డీఎంకేని నాశనం చేస్తామంటూ ప్రతిజ్ఞలు చేసినవారంతా పత్తాలేకుండా పోయారని తెలిపారు. అన్నామలై చేస్తున్న అనవసరమైన విమర్శలు డీఎంకే శ్రేణులలో ఉద్వేగం పెరుగుతుందనే విషయం ఆయన గుర్తుంచుకోవాలని ఆర్ఎస్ భారతి హితవు పలికారు. అరివాలయం చివరి ఇటుక తొలగించేంతవరకూ ఉంటానని చెబుతున్న అన్నామలై, ఆ భవనం వద్ద గడ్డి కూడా తొలగించలేరనే విషయం గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు.

అంతటి మగాడు పుట్టనేలేదు...

అరివాలయాన్ని, డీఎంకేని కూల్చే మగాడు ఇంకా పుట్టనేలేదని దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఎన్నికల్లో పోటీ చేయని అన్నామలై డీఎంకే గురించి అనవసరమైన విమర్శలు చేయడం గర్హనీయమన్నారు. నగరంలో మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... డీఎంకేని, అరివాలయాన్ని నాశనం చేస్తామంటూ శపథాలు చేసినవారంతా కాలగర్భంలో కలిసిపోయారని, ఆ కోవలోనే అన్నామలై అడ్రస్ లేకుండా పోవటం ఖాయమన్నారు. 75 యేళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన డీఎంకే కార్యాలయం అరివాలయాన్ని కదిలించే మగాడు ఇంకా పుట్టనే లేదన్నారు. 2026 ఎన్నికల్లో డీఎంకే భారీ మెజారిటీలో అధికారంలో వచ్చితీరుతుందని, ఆ తర్వాత అన్నామలై సహా బీజేపీ నేతలంతా మూటముల్లె సర్దుకుని ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లటం ఖాయమని శేఖర్‌బాబు జోష్యం చెప్పారు.

నాలుగు చోట్ల బాంబు బెదిరింపులు

- సీఎం వెళ్లే మార్గం, మంత్రి ఇల్లు, ఎళిలగం, రైల్వేస్టేషన్లలో తనిఖీలు



రైలు పట్టాలపై జాగిలాలతో తనిఖీ



నుంగంబాక్కం రైల్వేస్టేషన్‌లో పోలీసుల తనిఖీలు

పెరంబూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నాలుగు ప్రసిద్ధప్రాంతాలకు బాంబుబెదిరింపు రావడం కలకలం రేపింది. అయితే క్షుణ్ణంగా తనిఖీ పోలీసులు అవన్నీ ఉత్తుత్తి బెదిరింపులేనని తేల్చడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం అర్ధరాత్రి నుంచి నగరంలో ఉద్రిక్తత రేపిన బెదిరింపుల వివరాలిలా వున్నాయి.. స్థానిక మెరీనా కామరాజర్ రోడ్డు సమీపంలోని ఎళిలగంలో బాంబు ఉంచినట్లు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. ట్రిప్లికేన్ పోలీసులు వెంటనే ఎళిలగం చేరుకొని తనిఖీ చేసి ఎలాంటి పేలుడు పదార్థం లేదని నిర్ధారించారు. ఈ బెదిరింపుకు పాల్పడింది బాలాజీ అని, మద్యం మత్తులో అతను ఫోన్ చేసినట్లు విచారణలో తెలిసింది. అదేవిధంగా నుంగంబాక్కం రైల్వేస్టేషన్‌లో బాంబు ఉంచినట్లు బుధవారం రాత్రి పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. దీంతో, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో అక్కడకు చేరుకున్న పోలీసులు, రైల్వేస్టేషన్, రైలు మార్గాలు, పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి ఉత్తుత్తిబెదిరింపుగా నిర్ధారించారు.

సీఎం వెళ్లే మార్గం... : ముఖ్యమంత్రి వెళ్లే మార్గంలో కోడంబాక్కం వద్ద బాంబు ఉంచినట్లు మరో వ్యక్తి గురువారం ఉదయం పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేశాడు. దీంతో పోలీసులు కోడంబాక్కం ప్రాంతానికి చేరుకొని ముఖ్యమంత్రి వెళ్లే మార్గంలో క్షుణ్ణంగా తనిఖీలు చేసి బాంబు బెదిరింపు ఫేక్ అని నిర్ధారించారు.

మంత్రి శేఖర్‌బాబు ఇంట్లో.. : హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ఇంట్లో బాంబు ఉంచినట్లు గురువారం ఉదయం సమాచారం అందింది. దీంతో, ఓట్టేరిలో ఉన్న మంత్రి శేఖర్ బాబు ఇంట్లో బాండ్ స్క్వాడ్ తనిఖీ చేశారు. ఆ ప్రాంతంలో పేలుడు పదార్థాలు లభ్యం కాలేదు. అయినా, మంత్రి ఇంటి వద్ద నిఘా పెంచినట్టు పోలీసులు తెలిపారు. ఈ నాలుగు ఘటనలతో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు పోలీసులు కంటికి కునుకు లేకుండా తనిఖీల్లో పాల్గొన్నారు.

సమాచార దర్శిని

23న 'సాహిత్యవనంలో లలిత సంగీత సౌరభం'

చెన్నై, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాస ధారావాహిక 158వ ప్రసంగ కార్యక్రమం జరుగనుంది. టి.నగర్ విజయరాఘవరోడ్డులోని ఆంధ్రా క్లబ్‌లో సాయంత్రం 6.30 గంటలకు జరుగనున్న ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన రచయిత్రి స్వాతి శ్రీపాద 'సాహిత్యవనంలో లలిత సంగీత సౌరభం' అనే అంశంపై ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని సంస్థ అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

'వెబ్ ఎంటెక్' కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మద్రాసు ఐఐటీలో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో 'వెబ్ ఎంటెక్' కోర్సును సాయంత్రం, వారాంతపు రోజుల్లో ప్రారంభించనున్నారు. ఉద్యోగాలు చేస్తున్న వారికోసం ప్రారంభించే ఈ కోర్సులో చేరేందుకు మే 31వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలి. మరిన్ని వివరాలకుhttps://code.iitm.ac.in/webmtech అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

ప్రభుత్వ అధికారులకు బెంగళూరు ఐఐఎంలో శిక్షణ

పెరంబూర్,ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 25 మంది అధికారులు ప్రభుత్వ పథకాల అమలు, ప్రాజెక్ట్‌లు రూపొందించడం తదితరాలు బెంగళూరు ఐఐఎంలో శిక్షణకు వెళ్లారు. ప్రభుత్వ పథకాలను లబ్దిదారులకు సక్రమంగా అందించడం, అర్హులైన వారికి పథకాలు అందుతున్నాయా, పేదలకు అందుతున్న సంక్షేమ సహాయాలు తదితరాల పర్యవేక్షణకు అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు, అందుకు రూ.50 లక్షలు కేటాయిస్తున్నట్లు ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఆ ప్రకారం, ముఖ్యమంత్రి కార్యాలయం సహా పలు విభాగాలకు చెందిన 25 మంది అధికారులు శిక్షణ కోసం బుధవారం బెంగళూరు ఐఐఎంకు వెళ్లారు.

మున్సిపాలిటీలుగా మూడు నగర పంచాయతీలు

పెరంబూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): శ్రీపెరుంబుదూర్, మహాబలిపురం, తిరువయ్యారు నగరపంచాయితీలకు మున్సిపాలిటీ స్థాయి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది.. రాష్ట్రంలోని చెన్నై, కోవై, మదురై, సేలం సహా 16 కార్పొరేషన్లను విస్తరించారు. అలాగే, 41 మున్సిపాలిటీలు, 25 పట్టణ పంచాయతీలు విస్తరించారు. కొత్తగా 13 మున్సిపాలిటీలు, 25 పట్టణ పంచాయతీలు ఏర్పాటుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఇప్పటికే ప్రకటించిన విధంగా, చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం, కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూర్, తంజావూరు జిల్లా తిరువయ్యారు తదితర మూడు నగర పంచాయతీలు మున్సిపాలిటీ హోదా పొందాయి. ఈ ప్రాంతం చరిత్ర, పర్యాటక ప్రాముఖ్యత, వ్యాపార, పారిశ్రామిక అభివృద్ధి తదితరాలు పరిగణలోకి తీసుకొని మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ గెజిట్‌లో ప్రచురించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్యారీస్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దిగువ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

అయ్యాపాక్కం: టీఎన్‌హెచ్‌బీ అయ్యాపాక్కం భవనం 1,2, ప్లాట్ నెం 7,000 నుంచి 10,000 వరకు, ఐసీఎఫ్ కాలని, తిరువేర్కాడు మెయిన్ రోడ్డు, టీఎన్‌హెచ్‌బీ ప్లాట్ నెం.6,000 నుంచి 7,000 వరకు, ఎంజీఆర్‌పురం

అంబత్తూర్: పొన్నియమ్మన్ నగర్, కస్తూరి నగర్, మెట్రో సిటి భవనం 2, అగ్రహారం, జేజే నగర్, టీవీఎస్ కాలని, టీవీఎస్ అవెన్యూ, టీవీఎస్ మెయిన్ రోడ్డు, దేవర్ నగర్.

2,642 వైద్యుల పోస్టుల భర్తీకి సర్టిఫికెట్ల పరిశీలన

పెరంబూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో ఖాళీగా ఉన్న 2,642 వైద్యుల పోస్టుల భర్తీకి సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలన బుధవారం ప్రారంభమైంది. ఈ నెల 15వ తేది వరకు జరుగనున్న సర్టిఫికెట్ల పరిశీలనకు 4,585 మందికి కాల్ లెటర్స్ పంపించారు. ఈ పోస్టుల భర్తీకి వైద్య ఉద్యోగుల ఎంపిక బోర్డు గత జనవరి 5వ తేది రాతపరీక్ష నిర్వహించగా, ఎంబీబీఎస్ పూర్తిచేసిన 24,000 మంది హాజరయ్యారు. పరీక్షా ఫలితాలు విడుదల చేసిన నేపథ్యంలో, సర్టిఫికెట్ల పరిశీలన తేనాంపేటలోని డీఎంఎస్ ప్రాంగణంలో ప్రారంభమైంది. 20వ తేది నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించి, అర్హులైన వారికి నియామక పత్రాలు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

రవాణాశాఖ మాజీ ఉద్యోగులకు రూ.396 కోట్లు

పెరంబూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రవాణా సంస్థ రిటైర్డ్ ఉద్యోగులకు నగదు ప్రయోజనాలందించేలా ప్రభుత్వం రూ.396 కోట్లు కేటాయించింది. రవాణా శాఖలో పదవీవిరమణ చేసి నగదు ప్రయోజనాలందని వారు సుమారు 8,000మంది ఉండగా, వారికి విడతల వారీగా ప్రభుత్వం నగదు చెల్లిస్తోంది. ఆ ప్రకారం, 2023 మే నెలలో పదవీ విరమణ, వాలంటరీ రిటైర్మెంట్, మృతిచెందిన వారి కుటుంబాలకు నగదు ప్రయోజనాలు అందించేలా రూ.396.09 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తూ జీవో విడుదల చేసింది.

రైల్వేలో భారీగా ఖాళీలు

● దక్షిణ రైల్వే ఉన్నతాధికారి వెల్లడి

అడయార్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖలో డ్రైవర్లు, స్టేషన్ మాస్టర్లు, టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బంది విభాగాల్లో ఖాళీలు ఎక్కువగా ఉన్నాయని, అందువలనే రైళ్ళ రాకపోకల్లో అంతరాయం కలుగుతోందని దక్షిణ రైల్వేకు చెందిన ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. ఇదే విషయంపై ఆయన మాట్లాడుతూ, రైల్వే శాఖలోని ఖాళీలను ఈ యేడాది చివరినాటికి భర్తీ చేయనున్నారని, దక్షిణ రైల్వేకు కూడా తగిన మొత్తంలో నిధులు కేటాయించనున్నారని తెలిపారు. పట్టాల మరమ్మతుల కోసం ఉత్తరాది కార్మికులు కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్నారన్నారు. ఖాళీలను భర్తీచేసిన తర్వాత కాంట్రాక్టు సిబ్బందిని తొలగిస్తామన్నారు. కాగా రైళ్ళ రాకపోకల్లో జాప్యం అనేది సహజంగా జరిగేదన్నారు. రైలు పట్టాల మరమ్మతులు, సిగ్నలింగ్ లోపాల కారణంగా రైళ్ళు ఆలస్యంగా రావడం, బయలుదేరి వెళ్ళడం జరుగుతుందన్నారు.

పాఠశాల విద్యాశాఖలో 238 పోక్సో కేసులు

● మంత్రి అన్బిల్ మహేష్

పెరంబూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖలో 238 పోక్సో కేసులున్నాయని, వాటిలో 11 మంది నిర్దోషులని తీర్పురాగా, ఏడుగురు మృతిచెందారని ఆ శాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. కొట్టూరుపురంలోని అన్నా సెంటినరీ లైబ్రరీ ప్రాంగణంలో మంత్రి అన్బిల్ మహేష్ నేతృత్వంలో 10,11,12 పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లపై పర్యవేక్షణ, తనిఖీ అధికారుల సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి అన్బిల్ మహేష్ మాట్లాడుతూ... దృష్టి లోపం ఉన్న 12వ తరగతి విద్యార్థులు కంప్యూటర్ ద్వారా పరీక్ష రాయనున్నారని తెలిపారు. 12వ తరగతి పబ్లిక్ పరీక్షలకు 8.21 లక్షల మంది, 11వ పబ్లిక్ పరీక్షలకు 8.23 లక్షలు మంది, 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు 9.13 లక్షల మంది హాజరుకానున్నారని తెలిపారు. పబ్లిక్ పరీక్షల కోసం ప్రతిరోజు 40వేల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు.


మీడియా సమావేశంలో మంత్రి అన్బిల్ మహేష్

238 పోక్సో కేసులు: సమావేశం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... పాఠశాల విద్యాశాఖలో 238 పోక్సో కేసులుండగా, పోక్సో కేసుల్లో నేరారోపణలు ఎదుర్కొంటున్న 56 మందిపై త్వరలో తీర్పు రానుందని తెలిపారు.ఫిర్యాదులకు సంబంధించి తప్పు చేసినవారు ఏపాఠశాలల్లో పనిచేస్తున్నా చర్యలు తీసుకుంటామన్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత పాఠశాలల యాజమాన్యం విచారణ చేపట్టాలని, అలసత్వం వహించే వారిపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. విద్యార్థులు ఎవరూ భయపడరాదని, భద్రత, రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తప్పు జరిగినప్పుడు అది ఎలాంటి తప్పు అయినా వెంటనే చర్యలు తీసుకొనేలా చర్యలు చేపట్టామని మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు.

అన్నాడీఎంకేలో విలీనానికి సిద్ధం

● ఓపీఎస్

పెరంబూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి నిబంధన లేకుండా తనతో పాటు టీటీవీ దినకరన్, శశికళ తదితరులు అన్నాడీఎంకేలో విలీనానికి సిద్ధంగా ఉన్నామని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం తెలిపారు. ఈ వ్యవహారంపై తేనిలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 2026 అసెంబ్లీ ఎన్నికల్లో అందరూ సమష్టిగా పనిచేయాలని అధిక శాతం మంది కార్యకర్తలు కోరుకుంటున్నారన్నారు. కార్యకర్తల అభీష్టం మేరకు తాను, టీటీవీ దినకరన్, శశికళ అన్నాడీఎంకేలో విలీనానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అత్తికడవు-అవినాశి పథకానికి జయలలిత మినహా మరెవరికీ హక్కు లేదన్నారు. ఆ ప్రకారం, ఎడప్పాడి పళనిస్వామిని వ్యతిరేకిస్తున్నారా అనే విషయం సెంగోట్టయన్ సమాధానం చెప్పాలని ఓపీఎస్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

జిల్లాకు ఐదు 'అముదం' షాపులు

పెరంబూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు మార్కెట్ కంటే తక్కువ ధరకు కూరగాయలు, సరుకులందించేలా జిల్లాకు ఐదు 'అముదం' దుకాణాలు ప్రారంభించాలని తమిళనాడు వినియోగదారుల వాణిజ్య సంస్థ నిర్ణయించింది. ఈ సంస్థ ఇప్పటికే నగరంలో 17, కడలూరులో రెండు సహా రాష్ట్రవ్యాప్తంగా 61 చిన్న దుకాణాలు నడుపుతోంది. ప్రైవేటు దుకాణాలకు దీటుగా ఈ దుకాణాలు ఏర్పాటుచేయాలని సంస్థ నిర్ణయించింది. తొలివిడతగా అన్నానగర్, గోపాలపురంలోని దుకాణాలు ఆధునికీకరించి సరుకులు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఐదేసి దుకాణాలు ప్రారంభించాలని నిర్ణయించి, దుకాణాల ఏర్పాటుకు అవసరమైన స్థలాలు ఎంపిక చేసి పంపించాలని జిల్లా కలెక్టర్లకు లేఖ రాసింది.

సింగంపునరిలో చేపలు పట్టే వేడుకలు


చేపలు పడుతున్న గ్రామస్తులు

పెరంబూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా సింగంపునరి వేంగైపట్టి సమీపంలోని కొత్త కాలువ ఆయకట్టు ప్రాంతంలో కోత పనులు ముగియడంతో బుధవారం చేపలు పట్టే వేడుకలు నిర్వహించారు. ఉదయం 8.30 గంటలకు గ్రామ పెద్దలు తెల్ల టవల్ ఊపడంతో చేపలు పట్టే వేడుకలు ప్రారంభమయ్యాయి. అప్పటికే చిన్నపాటి వలలు, చీరలు, పంచెలతో సిద్ధంగా ఉన్న ప్రజలు ఒక్కసారిగా చెరువులోకి దిగి చేపలు పట్టారు.

వేసవిలో నిరంతరాయంగా విద్యుత్

పెరంబూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సమయాన్ని వృథా చేయకుండా వేసవిలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని విద్యుత్ బోర్డు ఛైర్మెన్ డా.జె.రాధాకృష్ణన్ ఇంజనీర్లకు సూచించారు. రాష్ట్ర విద్యుత్ బోర్డు ఛైర్మెన్‌గా ఈ నెల 10వ తేది పదవీ బాధ్యతలు చేపట్టిన రాధాకృష్ణన్, బుధవారం నగరంలోని విద్యుత్ బోర్డు ప్రధాన కార్యాలయంలో ఇంజనీర్లు, డైరెక్టర్లతో సమావేశమయ్యారు. సమావేశంలో రాధాకృష్ణన్ మాట్లాడుతూ.. విధుల్లో నిర్లక్ష్యం చూపొద్దని, ప్రజల ఫిర్యాదులపై సత్వరం స్పందించాలన్నారు. వేసవిలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేలా పాతబడిన ట్రాన్స్‌ఫార్మర్లు, పిల్లర్ బాక్స్‌లు, విద్యుత్ మార్గాల్లో మరమ్మతులు చేపట్టాలన్నారు. గిండి సహా పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేస్తున్న ఉప విద్యుత్ కేంద్రాల నిర్మాణ పనులు సత్వరం పూర్తిచేసేలా పర్యవేక్షించాలని ఇంజనీర్లను రాధాకృష్ణన్ ఆదేశించారు.

అపోలోలో మూర్ఛవ్యాధిగ్రస్థులకు ప్రత్యేక చికిత్సా కేంద్రం


చికిత్స పొందుతున్నవారితో డాక్టర్ వెంకటాచలం, డాక్టర్ అరవింద్ సుకుమారన్, డాక్టర్ ఎస్.ముత్తుకని

చెన్నై, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అపోలో హాస్పిటల్‌లో మూర్ఛవ్యాధిగ్రస్తుల కోసం అంతర్జాతీయ స్థాయి సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలతో ప్రత్యేక సంరక్షణ కేంద్రాన్ని (ఎపిలెప్సీ కేర్ సెంటర్) సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జెన్ డాక్టర్ అరవింద్ సుకుమారన్ గురువారం ప్రారంభించారు. అపోలో మెయిన్ హాస్పిటల్ నుండి అపోలో ప్రోటాన్ క్యాన్సర్ సెంటర్‌లో చికిత్స అందించడానికి అవసరమైన సలహాలు, సూచనలు, సాంకేతిక శస్త్రచికిత్సా పరికరాలు సమకూర్చనున్నారు. 3టి ఎంఆర్ఐ, ఈఈజీ స్యూట్ పెట్ సీటీ స్కాన్స్ వంటి పరీక్షా పరికరాలను కూడా అందజేస్తారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటాచలం, డాక్టర్ ఎస్ ముత్తుకని తదితరులు పాల్గొన్నారు.


వేలూరు సమీపంలో రైలు నుంచి తోసివేయబడిన గర్భిణి కుటుంబసభ్యులకు సీఎం ప్రకటించిన రూ.3 లక్షల పరిహారం అందజేస్తున్న జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి

డీఎంకే కూటమిని ఓడించడం ఎవరితరం కాదు

● మంత్రి రఘుపతి

ప్యారీస్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే - బీజేపీ ఏకమై రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసినా డీఎంకే కూటమిని ఓడించడం సాధ్యం కాదని రాష్ట్రన్యాయశాఖా మంత్రి రఘుపతి జోష్యం చెప్పారు. రాష్ట్రంలో అధికార డీఎంకే ఓటు బ్యాంకు 5శాతం పెరిగిందన్న ఓ సర్వేపై స్పందించిన మంత్రి రఘుపతి ఈ మేరకు అభిప్రాయాన్ని తెలియజేశారు ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే మోడల్ ప్రభుత్వానికి రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతోందని మంత్రి అన్నారు. 2026లో రాష్ట్ర అసెంబ్లీకి జరగబోయే ఎన్నికల్లో అన్నాడీఎంకే, బీజేపీ పార్టీలు ఏకమై పోటీ చేసినా, విజయం వరించేది మాత్రం డీఎంకే కూటమినేనని నమ్మకం వ్యక్తంచేశారు. అన్నాడీఎంకే సీనియర్ నేతలు సెంగోటయ్యన్ ఈపీఎస్ పట్ల అసంతృప్తితో వున్నారని, ఆయన లాగే మరికొంత మంది సీనియర్లు కూడా వున్నారన్నారు. రాష్ట్రంలో డీఎంకే కూటమి ఓటు బ్యాంకు 50శాతానికి పైగా పెరిగిందని, రాష్ట్రంలో ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించినట్లయితే 39స్థానాల్లో ఈ కూటమినే విజయం తప్పక వరిస్తుందని సీఓటర్ సర్వేలో వెల్లడైన విషయాన్ని మంత్రి వక్కానించారు. కులాల వారీగా జనగణన నిర్వహించాల్సిందిగా కేంద్రప్రభుత్వాన్ని ఒత్తిడి చేస్తున్నట్లు మంత్రి రఘుపతి తెలిపారు.

ట్రాఫిక్‌కు అడ్డంగా ఉన్న గాంధీ విగ్రహం తొలగింపు


గాంధీ విగ్రహాన్ని తొలగిస్తున్న అధికారులు

తిరుత్తణి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మున్సిపాలిటీలోని కామరాజ్ కూరగాయల మార్కెట్ ప్రాంతంలో 40ఏళ్లుగా రోడ్డు సర్కిల్ మధ్యలోవుండే గాంధీ విగ్రహాన్ని గురువారం ఉదయం అధికారులు తొలగించారు. తిరుత్తణి నుండి కాంచీపురానికి వెళ్లే మార్గంలోని తిరుత్తణి బస్టాండ్ సర్కిల్‌లో 40ఏళ్లుగా గాంధీ విగ్రహం వుంది. ఆ విగ్రహం చుట్టు కూరగాయలు వ్యాపారులు రోడ్డుకు అడ్డుగా దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో ప్రతిరోజు వాహనాలకు అంతరాయం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో స్థానికులు ఫిర్యాదు మేరకు తిరుత్తణి రెవెన్యూ కమిషనర్ స్పందించి 50మంది పోలీసు బలగాలతో గురువారం అక్కడికి చేరుకుని ఆ దుకాణాలతో పాటు గాంధీ విగ్రహాన్ని కూడా తొలగించారు. ఈ విగ్రహాన్ని అరక్కోణం బస్టాండ్ సమీపంలోని ఓ పార్క్‌లో ప్రతిష్ఠించనున్నట్లు అధికారులు తెలిపారు.

రూ.50లక్షలతో ప్రభుత్వాస్పత్రిలో అదనపు గదులు


శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే చంద్రన్, పార్టీ ప్రముఖులు

తిరుత్తణి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పల్లిపట్టు సమీపంలోని అతిమాంజేరిపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50లక్షలతో ఆస్పత్రి అదనపు గదుల నిర్మాణానికి ఆ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిరోజు వందల సంఖ్యలో పేదలు ఈ ఆస్పత్రికి వస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రి గదుల కొరతపై రెండు నెలల క్రితం కొంతమంది చేసిన అభ్యర్థనను దృష్టిలో వుంచుకుని వెంటనే గదుల నిర్మాణ ఎనులు ప్రారంభించినట్లు ఎమ్మెల్యే చంద్రన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధనంజయ్ చెజియాన్, ఏరియా డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఆర్పుత్రరాజ్, డీఎంకే యూనియన్ కార్యదర్శి బీడీ చంద్రన్, ఇంజనీర్లు రవీంద్రనాథ్, సావిత్రి, జిల్లా హెల్త్ ఇన్స్పెక్టర్ ఎజుమలై, డీఎంకే నిర్వాహకుడు మురళీ, శివకుమార్, ఆర్.మణికందన్, డిప్యూటీ ఆర్గనైజర్ తేవర్ జాన్, కుమరేసన్, గురునాధన్, నరసింహన్, ఎం.సెల్వం, రాజేంద్రన్, వరద నాయుడు, మణి, తనవేలు తదితరులు పాల్గొన్నారు.

డీఎంకేలో జిల్లా ఇన్‌-చార్జీల నియామకం

ప్యారీస్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఈరోడ్, తిరుప్పూర్, విల్లుపురం, మదురై జిల్లాలోని శాసనసభా నియోజకవర్గాలకు డీఎంకే జిల్లా ఇన్‌చార్జులను నియమించినట్లు పార్టీ అధిష్ఠానం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఈరోడ్ తూర్పు, దక్షిణం, పశ్చిమ, మొడకుర్చీ నియోజకవర్గాల ఇన్‌చార్జిగా సీనియర్ మంత్రి ఎస్ ముత్తుస్వామి నియమితులయ్యారు. ఈరోడ్ ఉత్తరం, అంధియూర్, భవానీసాగర్, గోపిచెట్టిపాళయం ప్రాంతాలకు ఎస్.నల్లశివం, ఈరోడ్ సెంట్రల్‌కు మాజీమంత్రి తోపు వెంకటాచలం, తిరుప్పూర్ ఈస్ట్‌కు కె.సెల్వరాజ్, తిరుప్పూర్ పశ్చిమం మంత్రి ఎంపీ స్వామినాథన్ ఇన్‌చార్జులుగా నియమితులయ్యారు. తిరుప్పూర్ ఉత్తరంకు ఎన్.దినేష్‌కుమార్, వెస్ట్‌కు పద్మనాభన్, విల్లుపురం ఉత్తరానికి మాజీమంత్రి సెంజిమస్తాన్, విల్లుపురం దక్షిణంకు ఎమ్మెల్యే గౌతమ్‌శిఖామణి, విల్లుపురం సెంట్రల్‌కు ఆర్.లక్ష్మణన్, మదురై ఉత్తరంకు మంత్రి మూర్తి, మదురై నగర్‌కు కె.దళపతి, తంజావూర్ పశ్చిమంకు పళనిలేల్, తిరునల్వేలి సెంట్రల్‌కు అబ్దుల్ వాహబ్, నీలగిరి నియోజకవర్గానికి కేఎం.రాజు, తిరువళ్లూరు ఈస్ట్ నియోజకవర్గ ఇన్‌చార్జీలుగా ఎంఎస్‌కే రమేష్‌రాజ్ నియమితులయ్యారు.

విద్యార్థినిపై లైంగిక వేధింపులు

● ముగ్గురు విద్యార్థులపై పోక్సో కేసు

పెరంబూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఏడో తరగతి విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ముగ్గురు ప్లస్ వన్ విద్యార్థులపై పోక్సో కేసు నమోదైంది. సేలంలోని ఓ పాఠశాలలో గత నెల 22వ తేది రాత్రి ఏడవ తరగతి విద్యార్థినిపై ముగ్గురు ప్లస్ వన్ విద్యార్థులు లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటన గురించి బాధిత బాలిక తల్లిదండ్రులకు తెలిపింది. వారు పిల్లల హెల్ప్ లైన్ 1098కు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై ఆత్తూర్ మహిళా పోలీసులు, ముగ్గురు విద్యార్థులపై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

డివైడర్‌ను ఢీకొని కారులో చెలరేగిన మంటలు

● హోటల్ యజమాని సజీవదహనం


మంటల్లో దగ్ధమైన కారు

పెరంబూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అరియలూరులో డివైడర్ ఢీకొన్న కారులో మంటలు చెలరేగి హోటల్ యజమాని సజీవదహనమయ్యాడు. ఆండిమఠంలో హోటల్ నడుపుతున్న అన్బళగన్ గురువారం ఉదయం తన కారులో హోటల్‌కు బయల్దేరారు. హఠాత్తుగా స్టీరింగ్ లాక్ అవడంతో కారు రోడ్డు మధ్యలోని డివైడర్‌ను ఢీకొన్న వెంటనే మంటలు చెలరేగాయి. కారు నడుపుతున్న అన్బళగన్ బయటకు వచ్చేలోపు మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కల వారు కూడా అతనిని రక్షించాలని ప్రయత్నించినా సాధ్యం కాకపోవడంతో, అన్బళగన్ కారులోనే సజీవ దహనమయ్యాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలు అదుపుచేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

చట్ట వ్యతిరేకంగా నివశిస్తున్న బంగ్లాదేశ్ దంపతుల అరెస్ట్


బంగ్లాదేశ్ దంపతులు

పెరంబూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్‌లో తగిన అనుమతి పత్రాలు లేకుండా చట్ట వ్యతిరేకంగా బసచేస్తున్న బంగ్లాదేశ్ దంపతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కె.చెట్టిపాళయంలోని బనియన్ కంపెనీలో బంగ్లాదేశ్‌కు చెందిన వారు పనిచేస్తున్నట్లు నల్లూరు పోలీసులకు సమాచారం అందడంతో, పోలీసులు ఆ పరిశ్రమలో విచారించారు. అక్కడ పనిచేస్తున్న సయ్యద్ మోదిర్ రెహ్మాన్, ఆయన భార్య అంజనా అక్తర్ బంగ్లాదేశ్‌కు చెందిన వారని తెలిసింది. ఈ దంపతులు 11 ఏళ్లుగా అయ్యంపాళయం తిరుమూర్తి నగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటూ, ఈ పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నట్లు తెలిసింది. సరైన పత్రాలు లేకుండా పశ్చిమ బెంగాల్ మీదుగా దేశంలో ప్రవేశించి తిరుప్పూర్‌లో ఉద్యోగం చేసుకుంటున్నట్లు విచారణలో తెలిసింది.

సీమాన్ కేసుపై 19న తీర్పు

ప్యారీస్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నామ్ తమిళర్ కట్చీ (ఎన్‌టీకే) ఆర్గనైజర్ సీమాన్ తనను వివాహం చేసుకుంటానని మోసం చేసినట్లు సినీనటి విజయలక్ష్మి దాఖలు చేసిన కేసులో ఈ నెల 19న తీర్పు రానుంది. నటి విజయలక్ష్మి 2011లో సీమాన్ తనను వివాహం పేరుతో మోసం చేశారంటూ చేసిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ మద్రాస్ హైకోర్టులో 2011నుంచి జరుగుతోంది. ఈ నేపథ్యంలో తనపై విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదును రద్దు చేయాలని కోరుతూ, సీమాన్ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈనెల 19న ఈ రెండు పిటిషన్లపై విచారణ జరిపి అదేరోజే తీర్పు వెలువరించనున్నట్లు హైకోర్టు ఆదేశించింది.

ప్రైవేటు సంస్థల పాల ధర పెంపు

ప్యారీస్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రవేటు సంస్థల పాల ధర లీటర్‌కు రూ.2చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించాయి. పొరుగురాష్ట్రమైన పుదుచ్చేరిలో ఉన్న రుచి పాల సంస్థ గురువారం నుంచి పాలధర లీటర్‌కు రూ.2పెంచిన నేపథ్యంలో,రాష్ట్రంలోని వేద,విజయ్, యుగ వంటి సంస్థలు శుక్రవారం నుండి అదేస్థాయి లో పాల ధర పెంచుతున్నట్లు ప్రకటించాయి. కాగా రాజ్, అమృత, ఆదాన్, చక్ర, తమిళ్, భారత్ తదితర ప్రవేట్ సంస్థలు కూడా శనివారం నుండి పాల ధర రూ.2కు పెంచుతున్నట్లు ప్రకటించాయి. పాలు మాత్రమే కాకుండా లీటర్ పెరుగుపై రూ.5 పెంచడం గమనార్హం. దీనిపై వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంఘం సభ్యులు శటగోపన్ మీడియాతో మాట్లాడుతూ, ప్రవేటు సంస్థలు విచ్చలవిడిగా పాల ధరలు పెంచుతున్నాయని, రాష్ట్రప్రభుత్వ నిర్వహణలోని ఆవిన్‌లో పాల ఉత్పత్తి మరింత పెంచి సరసమైన ధరకు విక్రయించడం ద్వారా ప్రవేటు సంస్థలను కట్టడి చేయవచ్చని సూచించారు. ఇదిలా వుండగా తమిళనాడు సహకార పాల ఉత్పత్తిదారుల సమాఖ్య కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ, గత ఏడాది సుమారు 25లక్షల మంది ఆవిన్ పాలు కొనుగోలు చేయగా, ప్రస్తుతం 30లక్షలకు పెరిగిందని తెలిపారు.

మంత్రుల శాఖల్లో స్వల్ప మార్పు

ప్యారీస్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంత్రుల శాఖల్లో స్వల్ప మార్పులు చేసినట్లు రాజ్‌భవన్ ప్రకటించింది. ఆ మేరకు మంత్రులు ఎస్.రాజకన్నప్పన్, పొన్ముడిలకు అప్పగించిన శాఖల్లో స్వల్ప మార్పులు జరిగాయి. గిండిలోని రాజ్‌భవన్ గురువారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటనలో.. రాష్ట్ర రవాణా శాఖామంత్రి కన్నప్పన్ అదనంగా నిర్వహిస్తున్న ఖాదీ, గ్రామీణ వృత్తుల శాఖను అటవీశాఖా మంత్రి పొన్ముడికి కేటాయించారు. ఇకనుండి ఈ కొత్తశాఖ బాధ్యతలను మంత్రి పొన్ముడి నిర్వహిస్తారు. ముఖ్యమంత్రి స్టాలిన్ సిఫారసు మేరకు ఈ శాఖలు మార్చినట్లు రాజ్‌భవన్ ప్రకటించింది.

వైభవంగా వరదరాజ పెరుమాళ్ తెప్పోత్సవం

పెరంబూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం వరదరాజ పెరుమాళ్ ఆలయ తెప్పోత్సవం వైభవంగా జరుగుతోంది. 40 ఏళ్లకు ఒకసారి భక్తులకు దర్శనమిచ్చే అత్తివరదర్ ఈ ఆలయ ప్రాంగణంలోని ఆనందసరస్ట కొలనులోనే ఉన్నారు. ఈ కొలను ఏడాదికి నాలుగు సార్లు మాత్రమే తెరుస్తుంటారు. ఈ సారి మూడు రోజుల తెప్పోత్సవాలకు కొలను తెరచి, భక్తులు స్వామి దర్శనం చేసుకొనేందుకు అనుమతించారు. వరదరాజ పెరుమాళ్ ఆలయ తెప్పోత్సవం బుధవారం ప్రారంభం కాగా, గురు, శుక్రవారాలు నిర్వహించనున్నారు. శ్రీదేవి భూదేవి సమేత వరదరాజ పెరుమాళ్ ఆలయ కొలనులోని తెప్పలో విహరించారు. తొలిరోజు కొలనులో తెప్పలో ఉత్సవమూర్తులు మూడు ప్రదక్షిణలు, రెండో రోజైన గురువారం ఐదు ప్రదక్షిణలు చేయించగా, శుక్రవారం 9 ప్రదక్షిణలు చేపట్టనున్నారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శనం చేసుకున్నారు.


తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పాండ్య రాజుల కాలంనాటి శాసనాలు లభ్యం

ప్యారీస్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పాండ్య రాజుల కాలంలో బయటపడిన 800 ఏళ్లనాటి శిలాఫలకాలను కేంద్ర పురావస్తు శాఖ నిపుణులు పరిశీలించారు. మదురై జిల్లా మేలూరు మండలం పరిధిలోని కంబూరు గ్రామంలో పురావస్తు తవ్వకాల్లో పాండ్య రాజుల కాలం నాటి మూడు శిలాఫలకాలు లభ్యమయ్యాయి. సుమారు 800ఏళ్లనాటి శిలాఫలకాలు లభ్యమయ్యాయనే సమాచారంతో గురువారం ఉదయం కేంద్ర పురావాస్తు శాఖ నిపుణుల బృందం ఆ గ్రామానికి చేరుకుని సుమారు 5గంటల పాటు పరిశీలించారు. వీటిలో 1,223 నాటి శిలాఫలకంలో మొదటి మారవర్మ సుందర పాండియన్ శివాలయానికి బంగారు నాణేలు దానంగా సమర్పించారు. ఇక 1228 నాటి శిలాఫలకంలో పాండ్యరాజులు విఘ్నేశ్వరుడికి నిత్యపూజల కోసం భూమి దానం చేసినట్లుంది. మూడవ శిలాఫలకంలో పాండ్య రాజుల హయాంలో ప్రస్తుతం కంబూరుగా పిలుపొందుతున్న గ్రామా న్ని పూర్వం కంభవూర్ అని పిలిచినట్లు ఇక్కడి చరిత్ర చెబుతోంది.




'కాదల్ ఎన్నదు పొదువుడమై'లో ఓ దృశ్యం


'2కే లవ్‌స్టోరీ'లో వినోదిని, జగవీర్, బాలశరవణన్

వాలైంటెన్స్ డే సందర్భంగా
4 ప్రేమకథా చిత్రాలు విడుదల

తమిళ చిత్రజ్యోతి

ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 14వ తేదీ నాలుగు ప్రేమకథా చిత్రాలు విడుదలవుతున్నాయి. వీటితో పాటు మరో ఆరు కుటుంబ కథా చిత్రాలను కూడా రిలీజ్ చేస్తున్నారు. మొత్తంగా ఈ శుక్రవారం పది చిత్రాలు విడుదలవుతున్నాయి. విడుదలయ్యే లవ్‌స్టోరీ సినిమాల వివరాలను పరిశీలిస్తే,

'కాదల్ ఎన్నదు పొదువుడమై'

లిజోమోల్ జోస్, వినీత్, రోహిణి తదితరులు నటించిన లెస్బియన్ చిత్రం. భారతీయ చిత్రపరిశ్రమలో ఎవరూ సాహసం చేయని సబ్జెక్టుతో తెరకెక్కింది. ఒక యువతి తన స్నేహితురాలిపై ఆకర్షితురాలుకావడం అనే కథాంశాన్ని తీసుకుని దర్శకుడు జయప్రకాష్ రాధాకృష్ణన్ రూపొందించారు.

'2కే లవ్‌స్టోరీ'

సీనియర్ దర్శకుడు సుశీంద్రన్ సొంతంగా నిర్మించి దర్శకత్వం వహించిన మూవీ. జగవీర్ హీరోగా పరిచయమవుతుండగా వినోదిని, బాలశరవణన్ తదితరులు నటించారు. 'వెన్నిలా కబడ్డీ కుళు' మూవీ తర్వాత ఒక మంచి చిత్రానికి దర్శకత్వం వహించినట్టు దర్శకుడు చెపుతున్నారు. 2కే జనరేషన్ లవ్, ఫ్రెండ్‌షిప్, ద్రోహం తదితర అంశాలను ప్రస్తావిస్తూ కొనసాగింది.

'కన్నీరా'

అందరూ కొత్త నటీనటులు నటించిన ఈ చిత్రంలో పని, జీతమే ముఖ్యమని భావించే ప్రేమికుడు నుంచి దూరమయ్యే ప్రియురాలు, తన చదువు, వృద్ధి ముఖ్యమని భావించే ప్రేయసి నుంచి విడిపోయిన ప్రియుడు కథాంశంతో తెరకెక్కింది. కదివన్ దర్శకుడు. చాందిని కౌర్, మాయా, నందకుమార్ తదితరులు నటించారు.

'కాలై 9 మణి ముదల్ ఇరవు 9 మణి వరై కాదలర్ దినం'

బీఎంజీఎస్ పతాకంపై గౌరీ శంకర్ నిర్మించి, దర్శకత్వం వహించిన ఈ మూవీలో శరవణన్, అభినయ, అన్బళగన్, శ్రీభవి, ఐశ్వర్య భాస్కరన్, రమేష్ ఖన్నా, గుంకీ అశ్విన్, నటేశన్, తెనాలి, అహల్య తదితరులు నటించారు. మూడు రకాలైన ప్రేమికుల మనస్తత్వాలను వివరించేలా ఈ చిత్రాన్ని రూపొందించారు.

నా బిడ్డ ఆత్మ శాంతించివుంటుంది
• ఇళయరాజా

తన కుమార్తె భవధారణి ఆత్మ శాంతించి వుంటుందని నమ్ముతున్నట్టు ఇసైజ్ఞాని ఇళయరాజా పేర్కొన్నారు. భవధారణి జయంతిని పురస్కరించుకుని, ఆమె చివరగా సంగీతం సమకూర్చిన చిత్రం 'పుయలిల్ ఒరు దోణి' ఆడియో ఆవిష్కరణ బుధవారం రాత్రి నగరంలోని మ్యూజిక్ అకాడమీలో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఇళయరాజా ఆడియో ఆవిష్కరించి తన కుమార్తెతో ఉన్న జ్ఞాపకాలను పంచుకున్నారు. 'ఈ రోజు భవధారణి జన్మదినం. నా బిడ్డ పుట్టిన రోజు, మరణించిన రోజు ఒక్కరోజే కావడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇలాంటి సందర్భం ఎవరికీ రాదు. ఆమె ఆత్మ శాంతించివుంటుందని భావిస్తున్నాను. ఆమె సంగీతం అందించిన చివరి చిత్రం ఆడియో రిలీజ్ మ్యూజిక్ అకాడెమీలో నిర్వహించాలని నిర్మాతలు కోరారు. ఇందులో భవదారిణి స్వరపరిచిన పాటలను ఎంచుకుని నా బృందం ఆలపించడం సంతోషంగా ఉంది. ఈ ప్రపంచాన్ని వదిలి వెళ్ళడానికి ముందు ఆమె నాతో గడిపిన ప్రతి ఒక్క క్షణాన్ని ఎన్నటికీ మరచిపోలేను' అని అన్నారు. కాగా, బీజీ పిక్చర్స్ పతాకంపై జలీల్ నిర్మించిన ఈ చిత్రంలో విష్ణు ప్రకాష్, అర్చనా సింగ్, ఇలవరసు, రాధారవి, నమో నారాయణన్ వంటి పలువురు తారాగణం నటించారు. ఈసన్ దర్శకుడు. త్వరలోనే విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.


ఆడియో ఆవిష్కరణ దృశ్యం

'జీడీ నాయుడు'గా మాధవన్

'ఇండియన్ ఎడిషన్'గా గుర్తింపుపొందిన జీడీ నాయుడు జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కనున్న చిత్రంలో ఆర్.మాధవన్ హీరోగా నటించనున్నారు. అనేక యాడ్ ఫిల్మ్స్ రూపొందించిన కృష్ణకుమార్ రామ్‌కుమార్ కథ సమకూర్చి దర్శకత్వం వహించనున్నారు. 'రాకెట్రీ' వంటి మూవీ నిర్మించిన వర్గీస్ మూలన్ పిక్చర్స్ బ్యానరుపై విజయ్ మూలన్, వర్గీస్ మూలన్, ట్రైకలర్ ఫిలిమ్స్ పతాకంపై ఆర్.మాధవన్ కలిసి ఈ ప్రాజెక్టు తెరకెక్కించనున్నారు. కెమెరామెన్ అరవింద్ కమలనాథన్ క్రియేటివ్ ప్రొడ్యూసర్. నిర్మాతల్లో ఒకరైన విజయ్ మూలన్ మాట్లాడుతూ, 'వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన నాటి తరం గొప్ప వ్యక్తుల గురించి నేటి తరం యువత తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అలాంటి మహనీయుడే జీడీ నాయుడు. ఈయన జీవిత చరిత్రను 'జీడీ నాయుడు - ది ఎడిసన్ ఆఫ్ ఇండియా' పేరుతో నిర్మించనున్నాం. ఇందులో మాధవన్‌తో పాటు పలువురు అగ్రనటీనటులు నటిస్తున్నారు. వీరి వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం. ఈ సినిమా షూటింగ్ కోయంబత్తూరులో జరుగుతుంది. జర్మనీ వంటి విదేశాల్లో కూడా చిత్రీకరిస్తాం. ప్రీప్రొడక్షన్ నిర్మాణ పనులకే రెండేళ్ళ సమయం పట్టింది. ఈ నెలలో కోవైలో షూటింగ్ ప్రారంభిస్తాం. ఈ నెల 18వ తేదీన అధికారికంగా టైటిల్ అనౌన్స్‌మెంట్ చేస్తాం' అని వివరించారు.



రిచర్డ్ రిషి - దివ్య జంటగా 'సుబ్రమణి'

రిచర్డ్ రిషి, దివ్య జంటగా 'సుబ్రమణి' పేరుతో ఒక చిత్రం తెరకెక్కుతుంది. డైరెక్టర్ విన్సెంట్ సెల్వ కథ, స్క్రీన్‌ప్లే, మాటలు సమకూర్చగా, ఆయన వద్ద గతంలో అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేసిన రాహుల్ పరమహంస దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్.ప్రొడక్షన్స్ పతాకంపై ఎస్.సౌందర్య నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు వివరాలను విన్సెంట్ సెల్వ వివరిస్తూ, 'మనిషికి, శునకానికి మధ్య ఉన్న బంధం శాశ్వతమైనది. అకిరా కురోసావా, స్టీవెన్ స్పీల్‌బర్గ్ వంటి హాలీవుడ్ దిగ్గజ దర్శకులు తమ చిత్రాల్లో కుక్కలకు అమిత ప్రాధాన్యత ఇచ్చారు. అలాగే, ఇపుడు నాకు ఒక క్రైమ్ థ్రిల్లర్ స్టోరీ లభించింది. దాని ఆధారంగా 'సుబ్రమణి'ని రూపొందించాం. రిచర్డ్ రిషి పోలీస్ ఇన్‌స్పెక్టరుగా నటించగా, అనేక దేశాల రక్షణ రంగంలో ఉపయోగించే శిక్షణ పొందిన బెల్జియన్ మలినోయిస్ అనే జాతి శునకం ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఈ సినిమా కోసం శునకంతో నెల రోజుల పాటు రిషి ఎంతో సన్నిహితంగా మెలిగారు. ఇప్పటికే తొలి దశ షూటింగ్ పూర్తి చేశాం. త్వరలోనే తదుపరి షెడ్యూల్‌ను ప్రారంభించనున్నాం' అని పేర్కొన్నారు.


'సుబ్రమణి'లో రిచర్డ్ రిషి

స్వయంభు లింగస్వామి ఆలయానికి స్వర్ణరథం

ప్యారీస్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా ఉవరి గ్రామంలోవున్న స్వయంభు లింగస్వామి ఆలయానికి స్వర్ణరథం సిద్ధమైంది. గ్రేటర్ చెన్నైకి చెందిన స్మార్ట్ క్రియేషన్స్ అనే సంస్థ దేవతల శిల్పాలు, వివిధ రకాల ఆకృతులతో 500కిలోల బంగారు పూతతో 16అడుగుల ఎత్తులో అద్భుతంగా రథాన్ని రూపొందించింది. ఈ సందర్భంగా సంస్థ సీఈఓ పంకజ్ బండారి ఈ స్వర్ణరథం గురించి మాట్లాడుతూ, తిరునల్వేలి జిల్లాలోని ఉవరి గ్రామంలో పురాతనమైన స్వయంభు లింగస్వామి ఆలయంలో నిర్వహించే ప్రధాన, వార్షికోత్సవాల సమయాల్లో స్వామివారిని ఊరేగించేందుకు వీలుగా ఈ రథాన్నా తీర్చిదిద్దినట్లు తెలిపారు. మొత్తం 25మంది స్వర్ణకారులు మైక్రోగోల్డ్ ప్లేటింగ్‌తో కళా నైపుణ్యంతో సుమారు 9నెలల వ్యవధిలో ఈ రథాన్ని నిర్మించినట్లు తెలిపారు.


సిద్ధమైన స్వర్ణరథం

'రేలా'లో వద్ధురాలికి బ్రెస్ట్ క్యాన్సర్ చికిత్స


శస్త్రచికిత్స చేసిన రేలా ఆస్పత్రి వైద్య బృందం

చెన్నై, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్రోంపేటలోని డాక్టర్ రేలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సెంటర్‌లో సౌత్‌కొరియాకు చెందిన 60 యేళ్ల వృద్ధురాలికి ఎండోస్కోపిక్ విధానంలో వక్షోజ సంరక్షణ క్యాన్సర్ శస్త్రచికిత్స నిర్వహించినట్లు ఆస్పత్రి సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ జగదీష్ చంద్రబోష్ తెలిపారు. వక్షోజ ప్రాంతంలోని క్యాన్సర్ కణితిని తొలగించి రక్తస్రావం జరగకుండా ఈ శస్త్రచికిత్స చేసినట్లు ఆయన తెలిపారు. రేలా ఆస్పత్రి సీఈఓ డాక్టర్ ఇలన్‌కుమరన్ కలియమూర్తి మాట్లాడుతూ ఇటీవలి కాలంలో వక్షోజ క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతోందని, అటువంటి రోగులకు అంతర్జాతీయ స్థాయిలో తమ ఆస్పత్రిలో చికిత్స చేస్తామని చెప్పారు. ఆపరేషన్ చేసుకున్న సౌత్‌కొరియా వృద్ధురాలు మరుసటి రోజే పూర్తిగా కోలుకుని డిశ్చార్జి అయినట్లు తెలిపారు.

'పరాశక్తి' టైటిల్‌కు పెరుగుతున్న వ్యతిరేకత

● నీడ నిజం కాదు : పార్తిబన్

అడయార్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): శివకార్తికేయన్ హీరోగా సుధా కొంగరా దర్శకత్వంలో రూపొందనున్న చిత్రానికి 'పరాశక్తి' అనే టైటిల్ ఖరారు చేయడాన్ని చిత్రపరిశ్రమకు చెందిన పలువురు హీరోలు, సీనియర్ నటులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎన్నటికీ నీడ నిజం కాదంటూ కామెంట్స్ చేస్తున్నారు. స్టోరీలను చోరీ చేస్తున్న నేటి కాలంలో టైటిల్స్ కూడా అరువు తెచ్చుకుంటారా? అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై సీనియర్ దర్శక నటుడు, నిర్మాత ఆర్.పార్తిబన్ స్పందిస్తూ, 'నాకు తెలిసి 'పరాశక్తి' అంటే ఠక్కున గుర్తుకు వచ్చేది దివంగత శివాజీ గణేశన్ నటించిన గొప్ప చిత్రం మాత్రమే. మళ్ళీ మరో చిత్రానికి ఆ పేరు పెడితే అది శివాజీ గణేశన్ 'పరాశక్తి'కి నీడలా ఉంటుందేగానీ నిజం కాదు. అందువల్ల కొత్త చిత్రానికి పరాశక్తి అనే టైటిల్ పెట్టడాన్ని ఏకీభవించను. పాత టైటిల్ లేకుండా చేయాలని భావించరాదు. ఈ టైటిల్ పెట్టడాన్ని పరిశ్రమలోని అన్ని వర్గాల నుంచి వస్తున్న వ్యతిరేకతను మేకర్స్ గుర్తుపెట్టుకోవాలి' అని సూచించారు. అలాగే, మరో సీనియర్ నటుడు వైజీ మహేంద్రన్ కూడా ఇదే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. శివాజీ సంక్షేమ విభాగం అధ్యక్షుడు చంద్రశేఖరన్ మాట్లాడుతూ, 'రూ.100, రూ.200 కోట్ల బడ్జెట్‌తో తీసే చిత్రాల స్టోరీలను ఇతర చిత్రాల నుంచి చోరీ చేస్తున్నారు సరే.. చివరకు సినిమా టైటిల్స్‌కు కూడా కొరత ఉందా? అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో మేకర్స్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాలి.


వలసరవాక్కంలో కొత్తగా నిర్మించిన పేరాసియర్ అరంగంను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

నేడు ప్రేమికుల దినోత్సవం

● కోయంబేడులో రెండింతలు పెరిగిన రోజా పూల ధరలు
● వేలూరు కోటలోకి ప్రేమికుల నిషేధం ● బీచ్‌లో పటిష్ట భద్రత

పెరంబూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక బొకేలు, రోజా పూలు, గ్రీటింగ్ కార్డ్స్, ప్రత్యేక చాక్లెట్లు సిద్ధమయ్యాయి. మరీ ముఖ్యంగా రోజాలు, ప్రత్యేక పూలకు శుక్రవారం విపరీతమైన డిమాండ్ ఉండడంతో దుకాణాల వారు ఆ మేరకు ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కోయంబేడు మార్కెట్‌కు హోసూరు, బెంగళూరు, ఊటీ తదితర ప్రాంతాల నుంచి వివిధ రంగుల్లో గులాబీ పువ్వులు అధికంగా దిగుమతి చేసుకున్నారు. గులాబీ పూల కోసం గురువార సాయంత్రం మార్కెట్‌కు యువతీ, యువకులంతా తరలివచ్చారు. 20 కౌంట్ (ఒక పంచ్) ఎరుపు గులాబీలు రూ.450, బేబీ పింక్, జువనాలియనా, తెలుపు, పసుపు తదితర రకాల గులాబీలు రూ.350కి విక్రయమయ్యాయి. బహిరంగ మార్కెట్లు, వాణిజ్య కాంప్లెక్స్‌ల్లో రెండింతలు పెరిగాయి.

ప్రత్యేక ఆఫర్లు...

ప్రేమికుల దినోత్సవం సందర్భంగా షాపింగ్ మాల్స్, కాంప్లెక్స్‌ల్లోని శీతల పానీయాలు, హోటళ్లు ప్రత్యేక ఆఫర్లు కల్పించాయి. శీతల పానీయాలు, ఆహార పదార్థాలపై రాయితీతో పాటు ఈ కార్యక్రమంలో పాల్గొనే ప్రేమ జంటలకు ప్రత్యేక బహుమతులు ఇస్తామని కూడా ప్రకటించాయి. టిఫిన్, లంచ్, డిన్నర్‌లకు ఆహ్వానం పలికాయి. మరోవైపు డీజే పార్టీలకు కూడా కొన్ని సంస్థలు ఆఫర్లు అందిస్తున్నాయి.


ప్రేమికుల కోసం సిద్ధమవుతున్న రోజాలు


ప్రకృతిలో మమేకమైన ప్రేమ పక్షులు

బీచ్, పార్క్‌ల్లో ప్రత్యేక నిఘా...

ప్రేమికుల దినోత్సవం సందర్భంగా బీచ్, పార్క్ సహా ప్రేమికులు అధికంగా సంచరించే ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ప్రేమికుల దినోత్సవాన్ని కొన్ని హిందూ సంస్థలు వ్యతిరేకించడంతో పాటు ఆ రోజున పార్క్ సహా ఇతర ప్రాంతాల్లో సంచరించే ప్రేమికులకు పెళ్లి చేస్తామని ప్రకటించాయి.

వేలూరు కోటలోకి అనుమతి లేదు...

వేలూరు కోటలో శుక్రవారం ప్రేమ జంటలకు అనుమతి లేదని పోలీసు శాఖ తెలిపింది. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా కోటకు వచ్చే ప్రేమ జంటలను ప్రవేశ ద్వారం వద్దే అడ్డుకొని వెనక్కి పంపిస్తామని పోలీసు శాఖ తెలిపింది. అదే సమయంలో, కోట ఆలయం, మ్యూజియం తదితర ప్రాంతాలకు భక్తులు, పర్యాటకులు యధావిధిగా వెళ్లొచ్చని తెలిపారు. అలాగే, వేలూరులోని ఇతర ప్రాంతంలో ప్రేమ జంటలను వేధించే వారిపై కఠిన చర్యలు చేపడతామని పోలీసులు హెచ్చరించారు.

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సభ్యుడిగా ఇస్రో శాస్త్రవేత్త

అడయార్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సభ్యుడుగా ఇస్రో శాస్త్రవేత్త వీరముత్తువేల్ సహా నలుగురిని ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర వ్యాప్తంగా చిన్నారులు, మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం నేతృత్వంలో ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఇందులో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రానికి చెందిన ఇస్రో శాస్త్రవేత్త వీరముత్తువేల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యామండలి సభ్యుడిగా నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఈయనతో పాటు మనోన్మణియం సుందరనార్ వర్శిటీ ఉపకులపతి చంద్రశేఖర్, ప్రముఖ విద్యావేత్త మురళీధరన్, తరమణిలోని ప్రపంచ తమిళ పరిశోధనా కేంద్రం అసిస్టెంట్ ప్రొఫెస్ పన్నీర్‌సెల్వంను సభ్యులుగా నియమించింది. రాష్ట్రంలోని అన్ని కాలేజీలు, విశ్వవిద్యాల అభివృద్ధి కోసం కొత్త పథకాలు చేపట్టడం, బోధనా సిబ్బందికి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ, కాలేజీలో విద్యార్థుల అడ్మిషన్ విధానంలో క్రమబద్ధీకరణ, విద్యార్థినీ విద్యార్థుల రక్షణ నిర్ధారించడం, రాష్ట్రంలో కొత్త విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు విధి విధానాల రూపకల్పన తదితర అంశాలపై చర్చించి, నిర్ణయం తీసుకున్నారు.


వీరముత్తువేల్

మద్రాస్ వర్శిటీలో ముగిసిన ధర్మనిధి ఉపన్యాసాలు



ప్యారీస్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభమైన రెండురోజుల ధర్మనిధి ఉపన్యాసాలు గురువారంతో ముగిశాయి. మద్రాస్ వర్సిటీ తెలుగు శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకర్‌రావు అధ్యక్షతన రెండో రోజు కార్యక్రమంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మూడు ధర్మనిధి ఉపన్యాసాలు జరిగాయి. మొదటిగా ఎన్ఆర్ చందూర్ స్మారక ధర్మనిధి ఉపన్యాసంలో భాగంగా మదురై విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు జొన్నలగడ్డ వెంకట రమణ 'జర్నలిజం - మహిళ' అనే అంశంపై ఉపన్యసించారు. రెండవది ఆచార్య వరాడభూషి సంపత్‌కుమార్ ధర్మనిధి ఉపన్యాసంలో భాగంగా సీనియర్ జర్నలిస్ట్ ఈతకోట సుబ్బారావు 'మాడభూషి సాహిత్యం వచ్చని చెట్టంత చరిత్ర' అనే అంశంపై ప్రసంగించారు. చివరగా ములమూడి ఆదిలక్ష్మి ధర్మనిధి ఉపన్యాసంలో భాగంగా నన్నయ అనువాద విధానాన్నే తిక్కన, యర్రన కూడా అనుసరించారని ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ తన ప్రసంగంలో తెలిపారు. ధర్మనిధి ఉపన్యాసాలు విజయవంతం కావడానికి సహకరించిన సాహితీవేత్తలకు, ఉపన్యాసకులకు, తెలుగు శాఖ అధ్యాపకులకు, విద్యార్థులకు ముగింపు కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆచార్య విస్తాలి శంకర్‌రావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ముగింపోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన డా.ఎ.అంబ్రూణి తెలుగు శాఖ పూర్వవైభవాన్ని ధర్మనిధి ఉపన్యాస నిర్వాహకులను అభినందించారు. ఆత్మీయ అతిథులు క్రొవ్విడి రమాదేవి, వల్లా ప్రగడ స్రవంతి, పెద్దాడ సాయి సూర్య సుబ్బాలక్ష్మి తదితరులు నిర్వాహకులను ప్రశంసించారు. గ్లోరి స్వాగతం పలుకగా, పసల చైతన్యకుమార్ రెడ్డి గౌరవ వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది.


ఈతకోట సుబ్బారావును సత్కరిస్తున్న ఆచార్యులు విస్తాలి, మాడభూషి

కళా దర్శకుడు సురేష్ మృతి


సురేష్ కల్లేరి (ఫైల్‌ఫొటో)

అడయార్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ కళా దర్శకుడు (ఆర్ట్ డైరెక్టర్) సురేస్ కల్లేరి (57) గుండెపోటుతో మరణించారు. తమిళంలో వచ్చిన 'తెనావట్టు2, 'కుట్టిపులి', 'ఎన్న సత్తం ఇంద నేరమ్', 'జెయిల్','రాజవంశం', 'అనీది', 'బ్లాక్ రోస్'వంటి పలు చిత్రాలకు కళా దర్శకుడిగా పనిచేసిన సురేష్ గత కొంతకాలంగా అధిక రక్తపోటు సమస్యతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి 12.30 గంటల సమయంలో తీవ్రమైన ఛాతి నొప్పి రావడంతో హుటాహుటిన సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్ళగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. ఆయన భౌతికకాయాన్ని వలసరవాక్కంలోని స్వగృహంలో సినీ ప్రముఖుల సందర్శనార్థం ఉంచి,గురువారం అంత్యక్రియలు పూర్తి చేశారు. ఆయన మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలిపారు.

ఆరోగ్యకరమైన పని గంటలు ఎంతో ముఖ్యం


ఎంహెచ్ రాజాను సత్కరిస్తున్న నిర్వాహకులు

● డాక్టర్ ఎం.హెచ్.రాజా

అడయార్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవలి కాలంలో యజమాని, ఉద్యోగి మధ్య సంబంధాలు ఆందోళనకు గురిచేస్తున్నాయని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీఎం) ప్రెసిడెంట్ డాక్టర్ ఎంహెచ్ రాజా అన్నారు. పోరూర్‌లోని శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు తమ కుటుంబంతో గడపడానికి, పని జీవిత సమతుల్యత కలిగి వుండటానికి ఆరోగ్యకరమైన పని గంటలు ఎంతో ముఖ్యమని ఆయన పునరుద్ఘాటించారు. కార్మిక హక్కులను పరిరక్షించాలన్నారు. ఎలాంటి బెదిరింపులు లేని ఉపాధి భద్రత కల్పించాలన్నారు. అలాగే, సంస్థ ప్రయోజనాలను కాపాడటంలో కార్మికులు పూర్తి సహకారాన్ని అందించాలని కూడా ఆయన సూచించారు. కార్యక్రమంలో శ్రీ రామచంద్ర ఫ్యాకల్టీ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సెల్వం జేసయ్య తదితరులు పాల్గొన్నారు.




'కాశీ తమిళ్ సంగమం 3.0' కోసం తొలిగా ప్రారంభమైన ఎక్స్‌ప్రెస్‌కు గురువారం చెన్నై సెంట్రల్ స్టేషన్‌లో పచ్చజెండా వూపుతున్న రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి

గుంపులుగా వెళ్లండి

నడకమార్గంలో ఫారెస్ట్ సిబ్బంది



- చిరుత కలకలం నేపథ్యంలో భక్తులను అప్రమత్తం చేసిన అధికారులు


తిరుమల, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): అలిపిరి నడక మార్గంలోని ఏడోమైలు ముగ్గుబావి వద్ద గురువారం రాత్రి చిరుత కనిపించిందన్న భక్తుల కేకలతో అధికారులు అప్రమత్తమయ్యారు. విజిలెన్స్, ఫారెస్ట్ అధికారులు అక్కడికి చేరుకున్నారు. చిరుత అడవిలోకి వెళ్లిపోయిందని నిర్ధారించుకున్నాక భక్తులను గుంపులుగుంపులుగా అనుమతించారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు భద్రతను కట్టుదిట్టం చేశారు.

ముక్కంటి ఆలయ హుండీ ఆదాయం రూ.2.04కోట్లు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం హుండీ లెక్కింపు జరిగింది. స్వామి అమ్మవార్ల గర్భాలయాల వద్ద ప్రధాన హుండీలతో పాటూ పరివార దేవతల హుండీలను గురువారం ఉదయం ఆలయంలో లెక్కించారు. మొత్తం 40 రోజులకు రూ.2.04కోట్లు ఆదాయం వచ్చినట్టు అధికారులు చెప్పారు. డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2 లోని కంపార్టుమెంట్లు,నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.37 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,270

తలనీలాలు సమర్పించినవారు: 22,175

మార్కెట్‌లో ప్రేమ సందడి







గుప్పెడంత గుండెలోని కొండంత ప్రేమను వ్యక్తం చేయాలి. మనసులో ప్రేమ గిలిగింతలు పెడుతున్న అమ్మాయి హృదయాన్ని గెల్చుకోవాలి. ఇందుకోసం అందమైన నాలుగు మాటలు, పదాలను పోగేసి కవిత చెబితే సరిపోతుందా..చాలదంటున్నారు ఈతరం ప్రేమికులు.. గుర్తుంచుకునేలా శుక్రవారం వేలెంటైన్స్ డేను సెలబ్రేట్ చేసుకోవాలనుకుంటున్నారు. వీరి మనసులోని భావాలను వ్యాపారంగా మార్చుకోడానికి మార్కెట్లు సిద్ధమయ్యాయి. ఇప్పటికే తిరుపతి నగరంలోని పలు గిఫ్ట్,ఫ్యాన్సీ షాపుల్లో ప్రేమికుల సందడి కనిపిస్తోంది. రకరకాల కేకులు,పుష్పాలు, బహుమతులు కొనుగోలుకు లవర్స్ సిద్ధమవుతున్నారు.







కాలిటి ప్రేమైక కుటుంబం

అపరంజి.. సుజాత



ప్రేమ పెళ్లిళ్లు చేసుకున్న అపరంజి సంతానం

ప్రేమంటే గుర్తుకు రావడం కాదు..జీవితాంతం గుర్తుంచుకోవడం అంటారు. పుత్తూరు పట్టణంలో అపరంజి కుటుంబాన్ని చూస్తే ఈ మాటలు అక్షరసత్యాలు అనిపించకమానదు. చాలామంది ప్రేమలు ప్రేమించడం అనే గడప దగ్గరే ఆగిపోతాయి. కానీ అపరంజి అలా కాదు. మనసిచ్చిన వారితోనే మనువు అని బలంగా విశ్వసించారు. ఒకసారి ఆయన ప్రేమ వివరాలు తెలుసుకుంటే.. దళిత సామాజికవర్గానికి చెందిన అపరంజి పేదరికంతో అష్టకష్టాలు పడ్డారు. డిగ్రీ పూర్తి చేశారు. ముద్దుకృష్ణమనాయుడు సిఫార్సుతో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చిరుద్యోగిగా చేరారు. అంచలంచెలుగా ఎదిగి హిందీ అధ్యాపకుడు స్థాయికి చేరుకున్నారు. జూనియర్ కళాశాలలో పని చేస్తున్న సమయంలో అక్కడ అగ్రవర్ణానికి చెందిన సుజాతతో పరిచయమేర్పడింది. అది ప్రేమగా మారింది. కులాలు మతాలు అడ్డువచ్చినా కాదని తోసిపుచ్చారు. ప్రేమపక్షానే నిలిచారు. పెద్దల నుంచి అభ్యంతరాలు ఎదురయ్యాయి. కానీ తాము పెళ్లితో ఒక్కటవుతామని పోలీసులు, పెద్దలకు తెగేసి చెప్పారు. ధైర్యంగా తిరుమలలో పెళ్లిపీటలెక్కారు. సమాజ ఆటు పోట్లకు వెరవకుండా కలిసి జీవితం సాగించారు. సుజాత ముగ్గురు పిల్లలు పుట్టిన తర్వాత భర్తకు చేదోడువాదోడుగా ఉండాలని సంకల్పించింది. టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసింది. ప్రభుత్వ టీచరుగా ఎంపికైంది. పిల్లలు సాయిలక్ష్మి, దివ్యశ్రీ, సాయిప్రకాష్‌లను ఈదంపతులు బాగా చదివించారు. తాము అనుభవించిన ఇబ్బంది మరొకరికి ఎదురుకాకూడదని పెళ్లి విషయంలో పిల్లలకు స్వేచ్ఛనిచ్చారు. ముగ్గురు పిల్లలు సహోద్యోగులను ప్రేమించారు. దీంతో వీరంతా ప్రేమ వివాహాలే చేసుకున్నారు. వీరి కుటుంబంలో రెండోతరం ప్రేమ వారసులుగా నిలిచారు. - పుత్తూరు, ఆంధ్రజ్యోతి

'ప్రేమ'యుద్ధంలో గెలిచారు

కుమార్తెలు యక్షకుమారి, లిఖితలతో పురుషోత్తం, కృష్ణకుమారి దంపతులు

పురుషోత్తం, కృష్ణకుమారిల్లో చిన్నప్పుడు చిగురించిన స్నేహం ఎదిగేకొద్దీ ప్రేమ పుష్పమై వికసించింది. పెద్దయ్యాక అయినవారు కాదన్నా ఒప్పించి ఒక్కటయ్యారు. నాయుడుపేటకు చెందిన పురుషోత్తం, కృష్ణకుమారీల మధ్య ఏడో తరగతి చదువుతున్నప్పుడు స్నేహం ఏర్పడింది. తరువాత ఇంటర్మీడియట్‌లో వేర్వేరు గ్రూపులు తీసుకున్నా కలిసే చదివారు. డిగ్రీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. 14 సంవత్సరాల వారి స్నేహం ప్రేమగా మారింది. 2002 సెప్టెంబరులో పురుషోత్తం ఇండియన్ ఆర్మీలో సోల్జర్‌గా ఎంపికయ్యాడు. ఈనేపథ్యంలో వీరి ప్రేమ వ్యవహారం ఇరు కుటుంబాలకు తెలిసింది. కృష్ణవేణి కుటుంబసభ్యులు అభ్యంతరం తెలియజేశారు. అయినప్పటికీ కృష్ణవేణి రెండేళ్లపాటు పెళ్లిచూపులు వాయిదావేస్తూ వచ్చింది. పురుషోత్తం వచ్చి తన మెడలో మూడుముడులు వేస్తాడని విశ్వసించింది. మిలటరీ ట్రైనింగ్ పూర్తి చేసుకున్నాక స్వస్థలానికి వచ్చారు. కృష్ణకుమారి తల్లిదండ్రులను, కుటుంబసభ్యులను ఒప్పించడంలో సఫలమయ్యారు. 2004 మే9న కృష్ణకుమారిని పెళ్లి చేసుకున్నారు. 2018 ఆగస్టు 31నపురుషోత్తం ఆర్మీలో హవల్దార్ హోదాలో రిటైరయ్యారు. ప్రస్తుతం ఆయన గ్రీన్‌టెక్ పరిశ్రమలో పనిచేస్తున్నారు.

- నాయుడుపేట, ఆంధ్రజ్యోతి

ప్రాణం తీసిన బనియన్

- తీసే క్రమంలో మెడకు బిగుసుకుని బాలుడి మృతి



తడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒంటిపై ఉన్న బనియన్‌ను తీసే క్రమంలో అది మెడకు బిగుసుకుపోవడంతో ఓ బాలుడు మృతిచెందాడు. తడ మండలం రామాపురం పంచాయతీ వెంకటాద్రి పాళెం గ్రామానికి చెందిన శరణేష్ (13) గురువారం ఇంటివద్ద స్నానం చేసేందుకు వెళ్లాడు. ఆ సమయంలో బనియన్‌ను తీస్తుండగా అది ఓ పక్క మెడకు, మరోపక్క దుస్తులను తగిలించే స్టాండ్‌కు తగులుకుంది. ఊపిరి అందక అక్కడికక్కడే మృతిచెందాడు. స్నానానికి వెళ్లిన బాలుడు అరగంట అయినా రాకపోయే సరికి కుటుంబ సభ్యులు తలుపులు బద్దలుకొట్టి చూడగా చనిపోయి ఉన్నాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పనిచేయని సర్వర్లతో ఆగిన రిజిస్ట్రేషన్లు



మూసి ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

కోట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : కోట సబ్‌రిజిస్ట్రార్ కార్యాల యంలో గురువారం సర్వర్లు పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆగిపోయింది. ఉదయం నుంచి కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాలకు చెందిన రైతులు, వ్యాపారస్తులు భూములు, ఇల్లు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వచ్చారు. సర్వర్లు మొరాయించడంతో సిబ్బంది చేతులు ఎత్తేశారు. దీంతో చేసేదిలేక ఆయా మండలాల రైతులు, వ్యాపారులు నిరాశతో వెనుదిరిగారు.

పరిశ్రమల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం

తిరుపతి (కలెక్టరేట్), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మీనాక్షి కంపెనీ (వేదాంత పవర్), సింహపురి జిందాల్ కంపెనీ, నవయుగ కంపెనీ ప్రతినిధులతో కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. సంబంధిత మ్యాప్‌లను పరిశీలించారు. ఎన్‌హెచ్‌ఏఐ నెల్లూరు వారితో పలు అంశాలపై చర్చించారు. జిల్లాలో పెట్టుబడులు పెట్టడానికి ఎంతో అనువైందని, తమ వంతు సహకారం అందిస్తామని పరిశ్రమలు ప్రతినిధులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఏపీఐఐసీ జెడ్‌ఎం నెల్లూరు శివకుమార్ పాల్గొన్నారు.

16న మంత్రి లోకేశ్ రాక

తిరుపతి (కలెక్టరేట్), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఈనెల 16 ఉదయం 9.20 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు రోడ్డు మార్గాన నెల్లూరు వెళ్లి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మనవడి వివాహానికి హాజరవుతారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు మళ్లీ విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాదు వెళ్లనున్నారు.

జనసేన నేత కిరణ్‌రాయల్‌పై చీటింగ్ కేసు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) తిరుపతి నగర జనసేన ఇన్‌చార్జి కిరణ్‌రాయల్‌పై యూనివర్శిటీ పోలీసులు గురువారం రాత్రి చీటింగ్ కేసు నమోదు చేశారు. సీఐ రామయ్య కథనం మేరకు.. ఇటీవల కిరణ్‌పై వివిధ రకాల ఆరోపణలు, విమర్శలు చేసిన లక్ష్మీరెడ్డి రెండు రోజుల క్రితం కిరణ్‌రాయల్ ఇచ్చిన డబ్బు అడిగినందుకు తనను చంపుతానని బెదిరిస్తున్నాడని, మోసం చేసి అవమానకరంగా ప్రవర్తించాడని ఎస్వీయూ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ రామయ్య సెక్షన్ 420, 417, 506తో పాటు బీఎన్ఎస్ యాక్టు కింద కేసు నమోదు చేశారు.

వ్యవసాయ కళాశాలకు మళ్లీ బాంబు బెదిరింపు మెయిల్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి వ్యవసాయ కళాశాలకు గురువారం మళ్లీ బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. సమాచారం అందుకున్న తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు ఆధ్వర్యంలో డాగ్, బాంబు స్క్వాడ్ సిబ్బంది కళాశాలలో ముమ్మరంగా గాలించారు. ఎక్కడా బాంబులకు సంబంధించిన ఆనవాళ్లు లభించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఐఐడీటీకి రూ.1.2 కోట్లు మంజూరు

తిరుపతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీస్ (ఐఐడీటీ)కు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.20 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ పథకాలు అమలు చేసేందుకు అదర్ గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ కింద ఈ నిధులను విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

వెటర్నరీ వర్సిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా చంద్రారెడ్డి

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా(ఏపీహైకోర్టు) అడ్వకేట్ ఆర్.చంద్రారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు లీగల్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్ సెక్రటరీ జి.ప్రతిభాదేవి బుధవారం నియామక ఉత్తర్వులు వెలువరించారు. మూడేళ్లపాటు ఈయన ఈ పదవిలో కొనసాగుతారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ధ్వజస్తంభాన్ని శుభ్రం చేస్తున్న అధికారులు,అర్చకులు

చంద్రగిరి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఘనంగా కోయిల్‌ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఈనెల 18నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న క్రమంలో ముందుగా ఈకార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. తెల్లవారుజామున స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం నిర్వహించారు. ఉదయం 6.30 నుంచి 10.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఆలయప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితరాలను నీటితో శుద్ధి చేశారు. అనంతరం సుగంధ ద్రవ్యాల పవిత్ర మిశ్రమంతో ప్రోక్షణ చేశారు. ఉదయం 11 గంటల నుంచి భక్తులకు దర్శనానికి అనుమతించారు.

పల్లెపండుగ పనులను నెలాఖరుకు పూర్తి చేయాలి

తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి గురువారం పంచాయతీరాజ్, డ్వామా అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై వర్చువల్‌గా సమీక్షించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు, సీసీ రోడ్ల నిర్మాణంలో పురోగతి చూపాలన్నారు. పుత్తూరు, సత్యవేడు, నాగలాపురం, వడమాలపేట మండలాలు లక్ష్య సాధనలో వెనుకంజలో ఉన్నాయని, పురోగతి చూపాలని అన్నారు. డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, పీఆర్ ఈఈ, డీఈలు, ఏఈలు, ఎంపీడీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

రేపటి నుంచి అరుణాచలం ప్యాకేజీ టూర్

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తమిళనాడులోని అరుణాచలానికి డైలీ ప్యాకేజీ టూర్‌ను శనివారం నుంచి ప్రారంభించనున్నట్లు డివిజనల్ మేనేజర్ సి.హెచ్.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు శ్రీనివాసం నుంచి వోల్వో ఏసీ బస్సు బయలుదేరుతుందని పేర్కొన్నారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు అరుణాచలంలో బయల్దేరి సాయంత్రం 5 గంటలకు వేలూరు గోల్డెన్ టెంపుల్, అక్కడి నుంచి సాయంత్రం 6 గంటలకు బయల్దేరి రాత్రి 9 గంటలకు తిరుపతి చేరుకుంటుందని వివరించారు. పెద్దలకు రూ. 1200, పిల్లలకు రూ.960 టిక్కెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. టిక్కెట్స్‌ను ముందస్తుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టూరిజం/ఏపీటీడీసీ.జీవోవీ.ఏపీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు.మరిన్ని వివరాలకు 9848850099, 9848973985, 9848802099, 08772289123, 9848007033లను సంప్రదించాలని కోరారు.

సహకార సంఘాల బలోపేతానికి చర్యలు



తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2025ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో సహకార సూత్రాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా రూపొందించిన కార్యక్రమాలను పక్కాగా అమలుపరచాలన్నారు. టెక్నాలజీని వినియోగించి ప్రాథమిక సహకారపరపతి సంఘాలను బలోపేతం చేయనున్నట్లు వివరించారు. ప్రతి రైతూ ప్రాథమిక సహకారపరపతి సంఘాల్లో సభ్యులుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 18నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే సహకార అవుట్‌రీచ్ క్యాంపెయిన్‌ని విజయవంతం చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీడీఎం నాబార్డ్ సునీల్, సీఈవో జుబేదబేగం పాల్గొన్నారు.

ఫ్లెమింగో ఫెస్టివల్ విజయవంతంపై సీఎం అభినందన

- జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దడానికి కృషిచేస్తాం
- కలెక్టర్ వెంకటేశ్వర్



ఫ్లెమింగో ఫెస్టివల్ ఆల్బమ్‌ను విడుదల చేస్తున్న సీఎం చంద్రబాబు

తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : సూళ్లూరుపేట వేదికగా గత నెలలో ఫ్లెమింగో ఫెస్టివల్-2025ను విజయవంతం చేసిన జిల్లా యంత్రాంగాన్ని సీఎం చంద్రబాబు అభినందించారు. గురువారం పర్యాటక రంగంపై వెలగపూడి సచివాలయంలో సమీక్షించిన సీఎం ఫ్లెమింగో ఫెస్టివల్ ఆల్బమ్‌ను విడుదల చేశారు. పుస్తకాన్ని అద్భుతంగా రూపొందించారని మంత్రి కందుల దుర్గేష్, అధికార బృందాన్ని అభినందించారు. ముఖ్యమంత్రికి కలెక్టర్ ధన్యవాదాలు తెలుపుతూ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టి జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

ఏపీపీగా బాలకృష్ణమ నాయుడు



తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన ప్రముఖ న్యాయవాది ముప్పారపు బాలకృష్ణమ నాయుడు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. ఈయన తిరుపతి ఐదవ జిల్లా అడిషనల్ సెషన్స్ కోర్టు, ఫ్యామిలీ కోర్టులో మూడేళ్ల పాటు సేవలు అందించనున్నారు. గతంలో ఈయన అసిస్టెంట్ గవర్నమెంటు ప్లీడర్‌గా పనిచేసి ప్రభుత్వం నుంచి రెండుసార్లు ఉత్తమ సేవా పతకం అందుకున్నారు. టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా, నగర లీగల్ సెల్ అధ్యక్షుడిగా సేవలు అందించారు. ఈయన సేవలను గుర్తించిన ప్రభుత్వం మరోసారి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించింది.

సాధువుల దీక్ష విరమణ



తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అలిపిరి రోడ్డులో ఒబరాయ్ హోటల్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ రెండు రోజులుగా టీటీడీ పరిపాలనా భవనం వద్ద శ్రీనివాస ఆనంద సరస్వతి ఆధ్వర్యంలో సాధువులు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను గురువారం రాత్రి విరమించారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచారి నేతృత్వంలో ఈస్ట్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ బాలకృష్ణ దీక్షా శిబిరం వద్దకు చేరుకుని వారికి నచ్చజెప్పి, నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.